క్లుప్తంగా

రైతులకు తప్పని తిప్పలు



మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

చిలప్‌చెడ్(నర్సాపూర్): అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో తూకం వేసిన ధాన్యం మొలకెత్తింది. బుధవారం గ్రామ రైతు మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతూ ఆవేదన వ్యక్తం చేశాడు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు సజావుగా జరగక, తూకం వేసిన ధాన్యం బస్తాలు సమయానికి తరలించకపోవంతో వర్షాలకు తడిసి మొలకెత్తిందని వాపోయారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం నిర్వాహకులు తేమశాతం తక్కువగా ఉంటేనే ధాన్యం కొనుగోలు చేస్తామంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ వెంకటేశం

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులకు చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ వెంకటేశం అన్నారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు టీసీలు, బోనోఫైడ్‌లు అందజేశారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. పదవ తరగతి తర్వాత పాలిటెక్నిక్‌తోపాటు ఇతర అవకాశాలపై వారికి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యకుమార్, లెక్చరర్ అనంత రాజశర్మ, ఉపాధ్యాయులు సిద్దిరాములు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కూరుకుపోయిన పాఠశాల ప్రహరీ



చెట్లతో నిండిపోయిన గోడ

శివ్వంపేట(నర్సాపూర్) : మండల పరిధి రూప్లతండా ప్రాథమిక పాఠశాలకు నిర్మించిన ప్రహరీ గోడ మట్టిలో కూరుకుపోవడంతో పాటు గేటు ధ్వంసమైంది. అమ్మ ఆదర్శ పాఠశాల అయినప్పటికీ పూర్తిస్థాయి వసతుల కల్పన లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రహరీ లేకపోవడంతో పశువుల సంచారంతోపాటు రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. జిల్లా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయం గురించి ఎంఈఓ బుచ్చానాయక్ దృష్టికి తీసుకెళ్లగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కేవలం ఫర్నిచర్, ఇతర వసతులు కల్పించడం జరుగుతుందని ప్రహరీ గోడ నిర్మాణానికి ఈజీఎస్ నిధుల మంజూరుకు నివేదించనున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాలు కల్గి ఉంటే చర్యలు

నర్సాపూర్ : నిషేధిత మత్తు పదార్థాలు కల్గి ఉన్నా, అమ్మినా చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఎక్సైజు సీఐ గులాం ముస్తాఫా హెచ్చరించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. తన సర్కిల్ పరిధిలో నిషేధిత మత్తు పదార్థాలు నివారణ కోసం ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్, కల్లులో కలిపే మత్తు పదార్థాల అమ్మకాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. పలు హైవే రహదారుల్లో ఆకస్మికంగా వాహనాల తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు, వినియోగం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని గంజాయిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ ఎవరైనా అమ్ముతున్నట్లు తెలిస్తే 87126 58924 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేటి నుంచి సాగుపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): జిల్లాల్లోని 45 గ్రామాల్లో నేటి నుంచి జూన్ 12వరకు ‘వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్’ ద్వారా వానాకాలం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్త రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం పంటలసాగు, సస్యరక్షణ, ఎరువులు, నీటి యాజమాన్యం, వ్యవసాయ యాంత్రీకరణ, నేల ఆరోగ్యం, సేంద్రియ, ప్రకృతి సాగు తదితర అంశాలపై గ్రామసభలను నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

కనిపించని మరుగుదొడ్లు

పంచాయతీలతో పాటు మండల కార్యాలయాల్లో స్వచ్ఛత కరువైంది. ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అవగాహన కల్పించిన అధికార యంత్రాంగం వారు పనిచేసే కార్యాలయాల్లో మాత్రం అమలు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించినా అవి వినియోగించలేని పరిస్థితి నెలకొంది.

– వెల్దుర్తి(తూప్రాన్)

- ప్రభుత్వ కార్యాలయాల్లో వసతులు కరువు
- ప్రజలు, ప్రజాప్రతినిధులకు తప్పని తిప్పలు
- పంచాయతీల్లో స్టోర్ రూంలుగా దర్శనం

మండల కేంద్రం వెల్దుర్తిలో కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి సుమారు ఏడాది క్రితం సంబంధిత అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలతో పాటు వర్తక, వాణిజ్య సంస్థల యజమానులు, అందులో పని చేసే వారి సౌకర్యార్థం బస్టాండ్ సమీపంలో గతంలో స్థల పరిశీలన చేశారు. కాంప్లెక్స్ నిర్మాణానికి రూ. 2.10 లక్షల ఉపాధి హామీ, రూ. 90 వేలు గ్రామ పంచాయతీ నిధులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. కాంప్లెక్స్ నిర్మాణానికి



మెల్లూర్ పంచాయతీలో స్టోర్ రూంగా మరుగుదొడ్డి

గుర్తించిన స్థలం వద్ద అక్రమంగా వెలిసిన నిర్మాణాలను తొలగించాల్సి వస్తుందనే కారణంతో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం పట్ల అధికారులు ఆసక్తి చూపలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు పట్టించుకోరు..?

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతీ పంచాయతీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్న నిబంధనను అధికారులు గాలికి వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ వైపు అద్దె భవనాలు, కమ్యూనిటీ హాల్‌లో అరకొర వసతుల నడుమ పంచాయతీలు కొనసాగుతుండగా, మరో వైపు అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా కొన్ని పంచాయతీల్లో మరుగుదొడ్లు ఉన్నా, వాటిని స్టోర్ రూంలుగా మార్చేశారు. పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన వస్తువులను మరుగుదొడ్ల రూంలో పడవేస్తున్నారు. స్వచ్ఛభారత్ పేరిట మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఓ వైపు



ఎంపీడీఓ కార్యాలయంలో..

కోట్ల రూపాయలు వెచ్చిస్తుంటే పంచాయతీ కార్యాలయాల్లో నిర్లక్ష్యంగా స్టోర్‌రూంలుగా మార్చడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమావేశాల సమయంలో ఇబ్బందులు

మరుగుదొడ్లు లేకపోవడంతో పురుషులు ఆరుబయట పనికానిచ్చేస్తున్నా.. మహిళలు నరకయాతన అనుభవిస్తున్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతీ నెలా పాలకవర్గ సమావేశాలు, రెండు నెలలకు ఒకసారి గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సమావేశాలకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు అత్యవసరానికి దూరంగా పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి వెల్దుర్తి మండలంలో 30 గ్రామపంచాయతీల్లో ప్రజాప్రతినిధులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు వస్తుంటారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్నా వాటిని స్టోర్‌రూంలుగా మార్చడంతో వారు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంత కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని పంచాయతీ కార్యాలయాల్లోనూ మరుగుదొడ్లు నిర్మించి వాడుకలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ఓ వరంలాంటిదని ఎమ్మెల్యే సునీతారెడ్డి అభివర్ణించారు. మండలంలోని ఆరెగూడం గ్రామానికి చెందిన కొడె అనూష వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.1.70 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను బుధవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఆమె అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, శేఖర్, ఏషయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

గోరక్షణ చట్టం అమలు చేయండి



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేగుంట(తూప్రాన్): గోరక్షణ చట్టం అమలు చేయాలని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో బుధవారం బీజేపీ, హిందూ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం గణేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని 48, 51 నిబంధనతో పాటు 1977 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోరక్షణ చట్టాలున్నా అమలు చేయడంలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగ్రం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గోరక్షణతోనే వ్యవసాయానికి మనుగడ ఉన్నందున గోరక్షణ చట్టం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డిలకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవింద్, భూపాల్, సాయిబాబా, హరిశంకర్, సాయిబాబా, చంద్రశేఖర్ విశ్వహిందూపరిషత్ సురేష్, భూపాల్‌రెడ్డి, హిందూ సంఘాల నాయకులు ఉన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్‌రావు కాలనీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు మురుగుకాల్వల్లో మురుగు తొలగించడం వీధులు, రహదారులను శుభ్రం చేసే పనులు కొనసాగిస్తున్నామన్నారు. ఇళ్లు, దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో పోగైన చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేసి చెత్త సేకరణకు ఆటోల్లో వేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని శానిటరీ అధికారి శ్రీనివాస్‌ను ఆదేశించారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జగ్జీవన్

టీబీ నిర్మూలనకు చర్యలు

న్యాల్‌కల్(జహీరాబాద్): టీబీ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని న్యాల్‌కల్ పీహెచ్‌సీ వైద్యుడు అమృత్ రాజ్ అన్నారు. నిక్షయ్ శిబిర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆస్పత్రిలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ వ్యాధిని నిర్మూలించేందుకు అన్ని గ్రామాల్లో టీబీ పరీక్షలు నిర్వహించామన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు.



టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న అమృత్‌రాజ్

కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మార్త, ల్యాబ్ టెక్నీషియన్ మాణయ్య, ఫార్మసిస్టు విష్ణువర్ధన్‌రెడ్డి, గోపిరాజ్, మంజుల, లక్ష్మి, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జీలుగ విత్తనాల పంపిణీ



హవేళీఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళీఘణాపూర్‌లో రైతు ఆగ్రోస్ సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు తీసుకువచ్చి విత్తనాలు తీసుకెళ్లొచ్చని వ్యవసాయ అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఆగ్రోస్ సేవా కేంద్రం నిర్వాహకులు నరేందర్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.

◆ అందుబాటులో జనుము విత్తనాలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయ్యపల్లిలో గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ శోభ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జనుము విత్తనాలు అవసరమున్న రైతులు పాస్‌బుక్‌తో పరిశోధనా స్థానం వద్దకు వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. రూ.95లకు కిలో ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు మొబైల్ నంబర్ 94406 32805 ను సంప్రదించవచ్చని తెలిపారు.

సీజనల్ వ్యాధులు తలెత్తకుండా చర్యలు

పెద్దశంకరంపేట(మెదక్): సీజనల్ వ్యాధులు తలెత్తకుండా మురుగుకాల్వలు శుభ్రపర్చాలని అధికారులకు ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. క్లోరినేషన్ చేపట్టాలని, నర్సరీల నిర్వహణ, ఉపాధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సంతోష్‌కుమార్, ఈసీ నవాజుద్దీన్ తదితరులున్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి కృష్ణ కోరారు. బుధవారం శంకరంపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం రైతులతో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రశీదులు తీసుకోవాలని సూచించారు. అధిక రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రీయ ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రవీందర్, ఏఈఓలు వినీత్, అఖిల్ తదితరులున్నారు.

గో సంరక్షణపై చర్యలు చేపట్టాలి

పెద్దశంకరంపేట(మెదక్): గోవుల సంరక్షణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల బీజేపీ అధ్యక్షుడు శ్రావణ్, మాజీ అధ్యక్షుడు కోణం విఠల్ తదితరులు ట్రైనీ ఎస్‌ఐ అరవింద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గోవులను అక్రమంగా తరలిస్తూ వధిస్తున్నారని, వాటిపై నిఘా పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, కృష్ణ, రవీందర్, సుభాష్, మహేష్, అంజయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు బదిలీ

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. మూడేళ్లకు పైబడి ఇక్కడ విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్స్ దేవదాస్‌ను టేక్మాల్‌కు, సాయిలు అల్లాదుర్గంకు, వెంకటస్వామి పెద్దశంకరంపేటకు బదిలీ చేస్తూ పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్వేతా కుమారి బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం 150 బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 30 కేజీల బ్యాగు ధర రూ.2,138 ఉందన్నారు. అవసరమైన రైతులు ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకుని గురువారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద విత్తనాలు తీసుకోవచ్చని తెలిపారు.

భవనానికి మళ్లీ రంగులు..

- వృథా అవుతున్న ప్రజాధనం
- విస్మయం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అల్లాదుర్గం(మెదక్): సుమారు రూ.3 లక్షలు వెచ్చించి భవనానికి రంగులు వేశారు. భవనం తళ తళలాడుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సంబంధిత అధికారుల ప్రతిపాదనలో మళ్లీ భవనానికి రంగులు వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. ఇది అదునుగా కాంట్రాక్టర్ పనులు చేపడుతున్నాడు. ఈ ఘటన అల్లాదుర్గం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చోటు చేసుకుంది. ఈ విద్యాలయం మరమ్మతులకు ప్రభుత్వం ఏడాది క్రితం సుమారు రూ.50లక్షలు మంజూరు చేసింది. ఇందులో బాత్‌రూంలు, విద్యుత్ , సిమెంట్, భవనానికి పెయింటింగ్ పనులు చేపట్టారు. ఈ పనులు చేసి ఏడాది కూడా గడవలేదు. కానీ మళ్లీ పెయింటింగ్ వేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో తళ తళలాడే భవనానికి మళ్లీ రంగులు వేస్తుండటంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అల్లాదుర్గం కేజీబీవీ భవనానికి పెయింటింగ్ వేసిన కాంట్రాక్టర్

జాతీయ సదస్సును జయప్రదం చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి



మాట్లాడుతున్న యాదగిరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వరంగల్‌లో 31 నిర్వహించ తలపెట్టిన ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పద్మశ్రీని రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించడం జరిగిందని, మాదిగ జాతికి అత్యున్నత గౌరవం తీసుకొచ్చిన ఆయనకు వరంగల్‌లో ఘన స్వాగతం పలుకుతూ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లళ్ల మొగులయ్య, మైసగల్ల బుచ్చేంద్ర, దుర్గాదాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ

ఎస్‌ఐ పోచయ్య

రేగోడ్(మెదక్): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ పోచయ్య కోరారు. మండల కేంద్రంరేగోడ్‌లో బుధవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఓటీపీ అడిగితే చెప్పొద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

అల్లాదుర్గం(మెదక్): తెలియని వ్యక్తుల నుంచి వీడియో కాల్స్ వస్తే ఎత్తవద్దని, తెలియని వారు ఫోన్ చేస్తే ఓటీపీ చెప్పవద్దని ఏఎస్‌ఐ గాలయ్య పేర్కొన్నారు. బుధవారం అల్లాదుర్గంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నా అని, మీ ఏటీఎం కార్డు లాక్ అయ్యిందని ఫోన్ చేసి ఓటీపీ చెప్పమంటే చెప్పొద్దన్నారు. ప్రస్తుతం ధాన్యం విక్రయించే రైతులను టార్గెట్ చేస్తున్నారని, ప్రజలు ఫోన్‌ల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్, ఏఓ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు గవ్వలపల్లిలోని విత్తనాల దుకాణాలను వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ అధికారులు కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్, విత్తన రకాలు, రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదు ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్ ఎంట్రీ చేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు రశీదులు తీసుకొని.. సీజన్ ముగిసేవరకు భద్రపరచాలన్నారు.



విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ ప్రవీణ్, ఎస్‌ఐ

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొల్చారం(నర్సాపూర్):మండలంలో రంగంపేట ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 1993–94 బ్యాచ్‌కు సంబంధించి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని చిన్నఘనాపూర్ సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. 31 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు పాఠశాల స్థాయిలో తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వేదికపై నాటి పాఠశాల మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.



రంగంపేట ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సమస్యలుంటే సమాచారం ఇవ్వండి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలనీలో ఏమైనా సమస్యలుంటే తనకు సమాచారం ఇవ్వాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని శాంతినగర్, వెంకటేశ్వర కాలనీ, లక్కదొడ్డి కాలనీల్లో పర్యటించారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లపై నిలిచిన వర్షం నీరు, డ్రైనేజీని కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది.. అదేవిధంగా మాన్సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, జీహెచ్‌ఎంసీ మేనేజర్ అరుణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ పవన్ ,హెచ్‌ఎండబ్ల్యూఎస్, మాన్సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

కబ్జా ఫిర్యాదుపై విచారణ

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో సర్వే నంబర్ 1000 ప్రభుత్వ భూమిలో కబ్జా జరిగిందని అందిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త ఇన్వెస్టిగేటివ్ డైరెక్టర్ వెంకట్‌రావు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. హెచ్‌ఆర్ సీపీసీ ట్రస్ట్ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారులు వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ భూమిలో రోడ్డు వేశారని, కబ్జాలు చేశారని ట్రస్ట్ తరఫున న్యాయవాది ఇంద్రజ లోకాయుక్త డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.